సంపుటి: 3 | సంచిక: 2

జనవరి - ఫిబ్రవరి, 2015

# దేవుని స్పర్శ

ఆధ్యాత్మిక ద్విమాస పత్రిక

**దిగులుపడకుము నేను నిన్ను బలపరతును**
**నీకు సహాయము చేయువాడను నేనే.**

– యెషయా 41:10





# “మనస్సులోని మాట”

**క్రీస్తుయేసునందు ప్రియులైన వారికి శుభమని చెప్పి వ్రాయునది.**

దేవుని స్పర్శ పాఠకులైన వారికి ప్రభువైన యేసుక్రీస్తు కృప సమృద్ధిగా కలుగును గాక ! అని దీవించి వ్రాయునది ఏమనగా మరియొక సంవత్సరము మనలను దేవుడు సజీవులుగా ఉంచినందుకు ఎంతో కృతజ్ఞత గల వారమై యుండవలెను.

భారతదేశ ప్రజలుగా గత సంవత్సరము జరిగిన సంగతులు మరువలేనివి. 30సం॥ల తరువాత ఒకే పార్టీ స్థిరమైన ప్రభుత్వమును ఏర్పాటు చేయగలిగింది. దీనివలన ప్రపంచ దేశములోని వారికి భారతదేశము పట్ల ఉన్న వైఖరిలో మార్పు స్పష్టముగా కనబడుచున్నది. అయితే అంతర్గతముగా అతివాదులైన కొందరు నాయకులు మతముల మధ్య చిచ్చు పెట్టి వ్యాఖ్యలు చేయడం శోచనీయ మైన విషయం. ఎవరు ఎన్ని మాట్లాడిన, దేశ ప్రజలు మరి ముఖ్యముగా క్రీస్తు ప్రబోధించిన మార్గములలో జీవిస్తున్నవారు సహనముతో దేశ అభివృద్ధిని, క్షేమమును కాంక్షిస్తూ ముందుకి కొనసాగవలసి ఉన్నది.

యేసుక్రీస్తు సర్వమానవాళికి ఇచ్చిన శాంతి సందేశమును గమనించినట్లైతే ఆయన ప్రభోధములను అనుసరించి నడిచేవారు గొప్ప శాంతి, సమాధానములు పొందడం మాత్రమే కాక, అనేకులకు సమాధాన కారకులుగా ఉంటారు. నేటి సమాజములో జరుగుచున్న అకృత్యాలు మానవ సంబంధములను ప్రశ్నించేవిగా ఉన్నాయి అనుటలో ఆశ్చర్యము లేదు. అందుకే కొందరు మానవ సంబంధములు అన్నీ ధనసంబంధములే అని నిట్టూర్పులు విడుచుచున్నారు. అయితే దానిలో కొంత వాస్తవము ఉన్నా, పూర్తి వాస్తవము కాదు. మానవ సంబంధములలో ప్రేమ, ఆప్యాయత, అనురాగములు అనేవి కూడా ఉన్నాయి అనుటలో సందేహము లేదు అని మనం గ్రహించాలి.

ప్రభువైన యేసుక్రీస్తుని అంగీకరించి, రక్షించబడిన వారు అనుసరిస్తున్న జీవన విధానము గొప్ప సంతోషమును సమకూరుస్తుంది. ఇలాంటి సంతోషమును మరి ఏ ఇతర సంతోషములతోనూ పోల్చలేము.

అట్టి ధన్యత దేవుని స్పర్శ పాఠకులకు కలుగును గాక !

మీ సహోదరుడు.....



సంపుటి: 3 | సంచిక: 2 జనవరి - ఫిబ్రవరి, 2015

# స్పర్శ

ఆధ్యాత్మిక ద్విమాస పత్రిక

## ఈ సంచికలో...


- "వాక్కు" దానము ........ 2
- బైబిల్‌లోని ప్రాముఖ్యమైన సంఘటనలు ........ 5
- గ్రహించవలసిన సంగతి.... (స్త్రీల ప్రత్యేకం) ........ 6
- సాధు సుందర్ సింగ్ జీవిత చరిత్ర - 38వ భాగము ........ 9
- చేసిన మేలులు మరవలేక.... (బాలల శీర్షిక) ........ 11
- దిద్దుబాటు ........ 13
- నా జీవితంలో చేసిన మేలులు (సాక్ష్యము) ........ 15
- విశ్వాసంలో ఎదుగుట ........ 17
- ప్రార్థనా శక్తి ........ 20
- బైబిల్ క్విజ్-38 ........ 22
- జన్మదిన శుభాకాంక్షలు ........ 23


మా చిరునామా :
ఎపఫ్రా మినిస్ట్రీస్, ప్లాట్ నెం.1, శాంతి నగర్, వాటర్‌ట్యాంక్ ఎదురుగా,
భాగ్యలత కాలని, వనస్థలిపురం, హైదరాబాద్ - 70, ఫోన్: 040-2420 2227




# "వాక్కు"దానము

- బ్రదర్. ఎపఫ్రా

**దిగులుపడకుము నేను నిన్ను బలపరతును**
**నీకు సహాయము చేయువాడను నేనే** - యెషయా 41:10

2015 సంవత్సరము దేవుని వాగ్దానము ఆధారముగా చేసికొని జీవించిన యెడల అది ఎంతో ఆశీర్వాదకరముగా ఉండునని నా భావన. ఎందుకనగా దేవుని మాట లేక వాక్యము లేదా వాగ్దానము ఎంత విలువైనదో కీర్తనాకారుడు ఈ విధంగా చెప్పాడు. నీ వాక్యము నా పాదములకు దీపము, నా త్రోవకు వెలుగు. అనగా ప్రతి దినము ఆయన మాటలు మన జీవితంలో ఎంతో ప్రయోజనకరంగా ఉంటాయి. బైబిల్ గ్రంథములోని మాటలు కేవలం అర్థవంతమైన మంచి విషయాలు మాత్రమే కాదు కానీ, ఆ మాటలు ఎంతో జీవం కలిగినవి. మరి ఏ ఇతర గ్రంథములోని మాటలతోను వీటిని పోల్చలేము. ఆదియందు వాక్యము ఉండెను వాక్యము దేవుడైయుండెను అనే మాట ప్రకారము వాక్యము ఎంత విలువైనదో, ఎంత పవిత్రమైనదో మనం అర్థం చేసుకోవచ్చు. ఆయన నామము కంటె ఆయన వాక్యమును దేవుడు హెచ్చించడం జరిగింది. అందుకే ఆయన నామమును ఉచ్ఛరించుట కంటే ఆయన మాటలను అనగా ఆయన వాక్యములను వాగ్దానములుగా నమ్మినవారి జీవితములలో గొప్ప కార్యములు నెరవేరుట మనము గమనించగలము. ఎవరు ఏ వాక్యమును నమ్ముటకు లేక విశ్వసించుటకు పరిశుద్ధాత్ముడు సహాయం చేయునో వారు ఆ వాగ్ధాన ఫలము అనుభవించుట జరుగుతుందని ఎందరో జీవితముల ద్వారా మనము గ్రహించవచ్చు.

దిగులుపడుట మానవుని జీవితములో చాలా సాధారణమైన సంగతి. దిగులుకి, భయము, చింత, నిరుత్సాహము, నిరాశ, కృంగిపోవుట అనేవి పర్యాయపదాలుగా మనం చూస్తున్నాము. మనము పరిష్కరించుకోలేని సమస్యలు వచ్చినప్పుడు లేక భరించలేని బాధ కలిగినా, స్థితికి మించిన అవసరతలలో మనము దిగులు చెందడం జరుగుతుంది. ఇది పూర్తిగా మానసిక సంబంధమైన సంగతి. యెషయా ప్రవక్త ద్వారా దేవుడు చెప్పిన మాటను మనము చూస్తే దిగులుపడకుము నేను నిన్ను బలపరతును నీకు సహాయము చేయువాడను నేనే యెషయా 41:10 చివరి భాగములో ఈ వాక్యమును దేవుడు 2015 సంవత్సరం కొరకు మన పరిచర్యకు వాగ్ధానముగా అనుగ్రహించారు. దిగులుపడకుము అని చెప్పిన వ్యక్తిని బట్టి మనము దానిని అనుసరించగలము. ఆయన అనగా దేవదేవుని సార్వభౌమాధికారం ఎంతగా మనము నమ్మగలమో అంతగా ఆయన మాటను స్వీకరించగలము.

ప్రతి మనుష్యుడు ఏదో ఒక సంగతిని బట్టి దిగులు చెందుతూ ఉండాలనేది అపవాది

ప్రణాళికలో భాగము. ఎందుకంటే మనము దిగులు చెందుతూ ఉంటే దేవుని యందు ఆనందించలేము. అంత మాత్రమే కాక దిగులు చెందుట దేవుని యెడల మన అవిశ్వాసమునకు గుర్తుఅయియున్నది. మనం అవిశ్వాసులుగా ఉండడం సాతాను యొక్క ముఖ్య ఉద్దేశ్యం. మన అనుదిన జీవితంలో ఎంత సమయం మనలను దిగులుచెందుతూ ఉంచగలిగితే అంతగా వాడు మన జీవితంపై విజయం సాధించినట్లే. నిన్ను దిగులు అనే ఊబిలో ఉంచినంత వరకు నీవు సంతోషముగా ఉండలేవు. నీవు ఎవరివైనప్పటికి, ఏ స్థితిలో ఉన్నప్పటికి ఎవరికి ప్రయోజనకరంగా ఉండలేవు. ప్రాముఖ్యముగా అపవాది దేవుని పనిలో ఉన్న పరిచారకులను, బోధకులను, వారి కుటుంబములను దిగులు అనే గుంటలోనికి తోసివేయడం ద్వారా వాడి పని మరింత సుళువుగా జరిగించుకుంటాడు.

బైబిల్ గ్రంథములో దేవుని ప్రజలైన ఇశ్రాయేలీయులు దిగులు చెందిన సందర్భమును పరిశీలించినట్లయితే మనం ఎన్నో ఆత్మీయ సత్యములను తెలుసుకోగలుగుతాము. **సౌలును ఇశ్రాయేలీలందరును ఆ ఫిలిష్తీయుని మాటలు వినినప్పుడు బహు భీతులైరి. - I సమూ 17:11**

వారు బహుగా భీతి చెందుటకు కారణం చూస్తే వారి యెదుట నిలిచిన వ్యక్తి యొక్క బాహ్యరూపము, ఆర్భాటము, అతని గంభీరమైన మాటలు, అతడు యుద్ధమునకు సన్నద్ధుడైన స్థితి. ఇంచుమించు 9అడుగుల కంటె ఎత్తైన వాడు. అతడు ధరించిన కవచము, కలిగి ఉన్న బల్లెము, ఈటె వారిని ఎంతో కృంగిపోయేటట్లు చేసినవి. అతను ప్రతి ఉదయము, సాయంత్రము నాతో పోట్లాడుటకు మీలో ఒక్కడు కూడా (యుద్ధము చేయుటకు) లేడా ? అని 40 రోజులు ప్రశ్నించి, ఎగతాళి చేయుచు వచ్చెను. కాని ఇశ్రాయేలీయుల సర్వసైన్యము ఏమీ చేయలేని నిస్సహాయమైన స్థితిలో ఉన్నారు. అప్పుడు రాజు మొదలుకొని, సైన్యాధికారులు, సైనికులు ఎవరికీ ఏమి చేయాలో పాలుపోని పరిస్థితి. ఆ సమయంలో దేవుని ఎల్లప్పుడు స్తుతించుచు ఆయన యొక్క బలమును, సామర్థ్యములను విశ్వసించిన దావీదు అనే బాలుడు తన అన్నలు సైన్యములో పనిచేయుచున్నందున వారిని చూచి వెళ్ళుటకు తన తండ్రి చేత పంపబడినవాడై గొల్యాతు పలుకుచున్న మాటలు విని హృదయములో నొచ్చుకొని దేవుని ప్రజలను దూషించుటకు ఇతను ఎంతటివాడు అని చెప్పి అతనితో యుద్ధము చేయ నిశ్చయించుకొనెను. అతని అన్నలు అతనిని కోపగించుకొనినను, రాజు నీవు యుద్ధము చేయలేవు అని నిరాశపరచినను దేవుని సార్వభౌమాధికారము నందు అతడు కలిగి యున్న నమ్మికనుబట్టి యుద్ధము యెహోవాదే అని ఫిలిష్తీయుడైన గొల్యాతుతో యుద్ధము చేయగా దావీదు యుద్ధములో గెలిచి ఇశ్రాయేలీయులందరికి గొప్ప విజయమును తెచ్చిపెట్టెను. దావీదు యుద్ధములో జయము పొందుటకు కారణం దిగులు చెందక పోవడం అతని యెదుట శత్రువు ఎంత శక్తిమంతుడైననూ వాని కంటె గొప్పదేవుడు తనకు సహాయం చేయుటకు ఉన్నాడని బలముగా విశ్వసించుట. అందుకే తనకు సహాయం చేయు దేవుని పేరట యుద్ధమునకు

వెళ్ళాడు.

మన జీవితములకు ఒక్కసారి ఈ సంగతిని అన్వయించుకుంటే ఎన్నో విషయములలో సమస్యలను చూచి దిగులు చెందుతూ ఉంటాము. ఈ భూమి మీద ఏ సమస్య కూడా మన ప్రభువైన దేవుని కంటె గొప్పవి కావు. కాని అపవాది అబద్ధికుడై ఎల్లప్పుడూ మనలను చిన్న, చిన్న విషయములకు సహితము కృంగిపోయే విధముగా చేస్తూ ఉంటాడు. మానసికంగా కృంగిపోవడం వలన శారీరకంగా కూడా శక్తిహీనులుగా మారుపోతూ ఉంటాము. సాతాను మన మీద చేసే ప్రధానమైన దాడి మానసికమైన దాడి. ఊహాజనితముగా వాస్తవము కంటే ఎక్కువగా మనలను ఆందోళనకు గురిచేస్తాడు. సౌలు, అతని సైన్యాధికారులు ఒక్క ప్రయత్నము కూడా చేయకుండా బహుగా భీతి చెంది ఓటమి దగ్గరకు వచ్చేశారు. కాని దావీదు శత్రువైన సాతానుకు అవకాశం ఇవ్వకుండా ముందుగానే తన హృదయములో నుండి దేవుని బట్టి ధైర్యముతో కూడిన మాటలు పలుకుతూ ముందుకు కొనసాగి జయము పొందాడు.

మనలను కూడా బలపరిచి, మనకు సహాయము చేయుటకు మన పరలోకపు తండ్రి ఆయన ఆత్మను అనుగ్రహించాడు. ఆ పరిశుద్ధాత్మ దేవుడు మనము దిగులుపడిన సమయములలో మనలను బలపరిచి, సహాయము చేస్తాడు. ఆఖరి శ్వాస వరకు మనకు అండగా ఉంటాడు. ఎన్నడూ ఏదీ తక్కువ కానివ్వడు. నిత్యత్వములో అనగా ఆయన రాజ్యములో చేర్చుకొనువరకు మనలను నడిపిస్తాడు.

అట్టి ధన్యత మనకు అనుగ్రహించును గాక!

**ముఖ్య గమనిక:**

మీ ప్రార్థనావసరతలకై **ఎపఫ్రా మినిస్ట్రీస్** ఆఫీసు నందు
సోమవారం నుండి శనివారం వరకు
ఉదయం 10.30 గం॥ల నుండి సాయంత్రం 6.30 గం॥ల
వరకు సంప్రదించగలరు.

---

ప్లాట్ నెం.1, శాంతినగర్, భాగ్యలత కాలని,
వనస్థలిపురం, హైదరాబాద్ - 500 070
Ph: 040-24202227 Cell: 9666666249
email: mail2church@gmail.com

---

**ఎపఫ్రా మినిస్ట్రీస్ పాటలు మరియు ప్రసంగముల సి.డి.లు కావలసినవారు మమ్ములను సంప్రదించగలరు.**

# బైబిల్‌లోని ప్రాముఖ్యమైన సంఘటనలు

36. బాప్తిస్మమిచ్చు యోహాను జననము – లూకా 1:57-80
37. ప్రభువైన యేసుక్రీస్తు జననము – లూకా 2:7
38. ఐగుప్తుకు పారిపోవుట – మత్తయి 2:13,14
39. యేసు తన 12 సం॥ల వయసులో యెరూషలేము దేవాలయమును దర్శించుట – లూకా 2:41-50
40. యేసు బాప్తిస్మము పొందుట – మత్తయి 3:13-17
41. యేసు అపవాది చేత శోధింపబడుట – మత్తయి 4:1-11
42. యేసు యెరూషలేము దేవాలయమును శుభ్రము చేయుట – యోహాను 2:13-25
43. యేసు 12 మంది శిష్యులను ఎన్నుకొనుట – మత్తయి 10:1-4
44. యేసు కొండపై ప్రసంగించుట – మత్తయి 5-7
45. యేసు లాజరును బ్రతికించుట – యోహాను 11
46. బాప్తిస్మమిచ్చు యోహాను మరణించుట – మత్తయి 14, మార్కు 6
47. పేతురు యేసును "నీవు సజీవుడగు దేవుని కుమారుడవైన క్రీస్తువు" అని ఒప్పుకొనుట మరియు యేసు సంఘమునకు వాగ్దానమిచ్చుట – మత్తయి 16
48. యేసు రూపాంతరము పొందుట – మత్తయి 17
49. యేసు విజయోత్సవముతో యెరూషలేములోనికి వచ్చుట – మత్తయి 21, మార్కు 11
50. మేడపై గదిలో సంఘటనలు – మత్తయి 26, మార్కు 14, లూకా 22, యోహాను 13,14
51. గెత్సేమనే తోటలో యేసు దుఃఖపడుట – మత్తయి 26, మార్కు 14, లూకా 22, యోహాను 18
52. యేసును విచారణ చేయుట – మత్తయి 26-27, మార్కు 14,15; లూకా 22,23; యోహాను 18, 19
53. యేసు సిలువ వేయబడుట – మత్తయి 27:35, మార్కు 15:24; లూకా 23:33; యోహాను 19:18

మరికొన్ని వచ్చే సంచికలో

# గ్రహించవలసిన సంగతి...

– సిస్టర్ వి.విజయ

దిగులుపడుట అనేది మనుష్యులందరి జీవితములో జరిగే సంఘటనే అయినప్పటికీ స్త్రీలమైన మనలో మరి ఎక్కువగా కనపడుతుంది. పరిశుద్ధ గ్రంథములో అనేకమంది స్త్రీల జీవితములే దీనికి ఉదాహరణ. సహజంగానే సమాజములో స్త్రీలు అనేక పాత్రలను (స్థానములు) పోషించవలసి ఉంటుంది. పుట్టినప్పటి నుండి చనిపోయే వరకు స్త్రీ పోషించే ప్రతి పాత్ర పురుషులతో పోల్చుకుంటే విలక్షణమైనది. అన్ని పాత్రలలోనూ పురుషుని కంటే ఎక్కువ ఒత్తిడి స్త్రీ కలిగి ఉంటుంది అనుటలో ఎటువంటి సందేహము లేదు. వీటన్నిటిని బట్టి స్త్రీలు దిగులు పడేపాళ్ళు ఎక్కువ అని చెప్పుకోవచ్చు. పరిశుద్ధ గ్రంథములో దిగులుపడిన స్త్రీల యొక్క జీవితముల గురించి ధ్యానిద్దాము.

ఎఫ్రాయిము మన్యమందు ఎల్కానా అను వ్యక్తి యొక్క ఇద్దరి భార్యలలో ఒక దాని పేరు హన్నా, రెండవది పెనిన్నా. వీరిలో పెనిన్నాకు పిల్లలు ఉన్నారు గాని హన్నాకు పిల్లలు లేరు. ఈ కారణమును బట్టి హన్నా అనుదినము కుటుంబములోని వారితో కోపముతో ఉంటూ, భోజనము మానివేసి, ఏడ్చుచూ, దిగులుతో జీవితమును గడుపుతూ ఉంది. ఏదైనా ఒక విషయమునకు కలిగే దిగులు, కోపమును, ఏడ్పును కలుగజేసి నిరాశలో దింపి, కుటుంబములో సమాధానమును దూరం చేస్తుంది. **హన్నా యెహోవా మందిరమునకు పోవునప్పుడెల్లా అది ఆమెకు కోపము పుట్టించెను గనుక ఆమె భోజనము చేయక ఏడ్చుచూ వచ్చెను. 1 సమూ 1:8**

మన జీవితములో కూడా మనకి లేని దానిని బట్టి, కలిగి ఉన్నవారి మీద అసూయతో, మనకి కావాలి అని తలంచినది పొందనప్పుడు కోపముతో, మనము ఊహించినట్లుగా పరిస్థితులు లేనప్పుడు దిగులుతో ఏడుస్తూ ఎంతో విలువైన సమయమును వ్యర్థము చేసుకుంటున్నామేమో ఆలోచించారా? అకారణంగా చిన్నదానికి, పెద్దదానికి దిగులుపడడం, కోపముతో భోజనం మాని ఏడవడం ఆరోగ్యమునకు నష్టం, ఆత్మీయజీవితమునకు ఆటంకం.

దేవుని యందు భయభక్తులు కలిగి, యధార్థవర్తనుడుగా ఉంటూ, ఆస్థిపరుడైన యోబు జీవితములో ఊహించని సంఘటన జరిగింది.

**యెహోవా - ఇదిగో అతనికి కలిగిన సమస్తమును నీ వశమున ఉన్నది, అతనికి మాత్రము ఏ హానియు చేయకూడదని అపవాదికి సెలవియ్యగా వాడు యెహోవా సన్నిధి నుండి బయలు వెళ్ళెను. - యోబు 1:12**

ఇది జరిగిన ఒక్క దినముననే యోబు కుమారులు, కుమార్తెలు ఆస్థి అంతటిని పోగొట్టుకోవడం జరిగింది. అయిననూ ఒక్క మాట కూడా యోబు దేవునికి వ్యతిరేకముగా మాట్లాడలేదు, దేవుడు అన్యాయము చేసెనని చెప్పలేదు. **కాబట్టి అపవాది యెహోవా సన్నిధి**



**నుండి బయలు వెళ్ళి, అరికాలు మొదలుకొని నడినెత్తి వరకు బాధగల కురుపులతో యోబును మొత్తెను. అతడు ఒళ్ళు గోకు కొనుటకై చిల్లపెంకు తీసుకొని బూడిదెలో కూర్చుండగా అతని భార్య వచ్చి - నీవు ఇంకను యథార్థతను వదలకయుందువా? దేవుని దూషించి మరణము కమ్మనెను. అందుకతడు- మూర్ఖురాలు మాటాలాడునట్లు నీవు మాటలాడు చున్నావు; - యోబు 2:6-10**

కుటుంబములో సమృద్ధి, సంతోషము, భర్తకి మంచి ఆరోగ్యము ఉన్నప్పుడు అన్నింటిలో పాలు పంచుకుంది యోబు భార్య. నిస్సహాయమైన స్థితిలోనే ఒకరికి మరియొకరి ఆదరణకరమైన, ధైర్యమును కలుగజేసే మాటలు అవసరం. కానీ యోబు భార్య కుటుంబములో భిన్నంగా ప్రవర్తించింది. ఆమె యొక్క దిగులు, చింత దేవుని దూషించి మరణము కమ్ము అనే మాటని పలికేటట్లుగా చేసి, మూర్ఖురాలిగా చరిత్రలో నిలిచిపోయేలా చేసింది. దేవుని మేలులు, సమృద్ధిని అనుభవించినంత వరకు బాగానే ఉంది, కానీకొంచెం శ్రమ, కష్టం కలిగిన వెంటనే దేవునికి దూరమైన మాటలను మాట్లాడుచూ ఆత్మీయజీవితములో నష్టపోయింది. మనలో ఎంత మందిమి దిగులు పడుతూ ఈ విధంగా సణిగే వారిగా ఉంటున్నాము? హృదయములు దేవునికి దూరమైన స్థితిలో ఉన్నాయి?

అందుకే దేవుడు ఈ 2015వ సంవత్సరములో మనకి అనుగ్రహించిన వాగ్దానమును ధ్యానించుకొని ధైర్యము తెచ్చుకొనవలసిన వారమై యున్నాము.

**దిగులు పడకుము నేను నిన్ను బలపరతును**

**నీకు సహాయము చేయువాడను నేనే - యెషయా 41:10**

మనకి ఏ పరిస్థితులు కలిగిననూ, ఇప్పుడు మనం ధ్యానించిన స్త్రీల వలె దిగులుతో జీవితములను సమయములను నష్టపరచుకొనక దేవునికి దూరము కాక,ఆయన మనలను ప్రేమించి ఇచ్చిన వాగ్దానమును ధ్యానించుచూ, ఏది ఎలా జరిగిననూ ముందుకి వెళ్దాము.

క్రొత్త నిబంధనా గ్రంథములో దేవుడు ఇచ్చిన వాగ్దానమును బట్టి ధైర్యము తెచ్చుకొని దేవుని పనిలో తమ్మని తాము వ్యయపరచుకుంటూ తమకు కలిగిన వాటిని యేసు కొరకు వ్యయపరుచుచూ ముందుకి వెళ్ళిన స్త్రీలు ఉన్నారు.

యేసుక్రీస్తు శిష్యులైన వారు దేవుని సువార్తను ప్రకటించుచూ, మొదటి సంఘముగా ముందుకు వెళ్ళుచున్న ఆ దినములలో ఆహారమును పంచిపెట్టుటకు ఏర్పరచబడిన ఏడుగురు మనుష్యులలో సైఫను ఒకడు. **ఈ సైఫను కృపతోను, బలముతోను నిండినవాడై ప్రజల మధ్య మహాత్కార్యములను, గొప్ప సూచకక్రియలను చేయుచుండెను. అపో.కా॥6:8.** కొందరు వచ్చి సైఫనును పట్టుకొని మహాసభ యొద్దకు తీసుకొని పోయి అబద్ధపు సాక్షులను నిలువబెట్టి,

**పట్టణపు వెలుపలికి అతనిని వెళ్ళగొట్టి రాళ్ళు రువ్వి చంపిరి. - అపో.కా॥ 7:58**

మొదటి సంఘములో మొట్టమొదటి హతసాక్షి సైఫను. యౌవనకాలములో చనిపోయిన సైఫనును బట్టి అతని ఇంటివారు ఎంతగా కుమిలిపోవలెనో, నేటి దినములలో మనము కలిగి ఉన్న స్వభావమును బట్టి చూడగా వారిని వారు శాపగ్రస్తులుగా తలంచుకోవాలి. కానీ వారు అలాగు ప్రవర్తించలేదు. కొరింథి సంఘమునకు పౌలు వ్రాస్తున్న ఉత్తరములో వారి ఇంటి వారిని గురించి ఈ విధంగా వ్రాశాడు. **సైఫను ఇంటివారు అకయ యొక్క ప్రథమ ఫలమై యున్నారనియు, వారు పరిశుద్ధులకు పరిచర్య చేయుటకు తమ్మును తాము అప్పగించుకొని యున్నారనియు మీకు తెలియును 1 కొరింథి 16:15**

ఇది ఎంతో గొప్ప అద్భుతమైన విషయం. దేవునిలో విశ్వాసం గల కుమారుడిని పోగొట్టుకొని కూడా దేవుని వాగ్దానమును బట్టి దిగులు చెందక, ఆ ఇంటివారు పరిశుద్ధులకు పరిచర్య చేయుటకు తమ్ముని తాము అప్పగించుకొనిరి అన్న విషయము నిజంగా మన హృదయములను కదిలించేదిగా ఉండాలి. చిన్న చిన్న విషయములకే దిగులుతో, చింతతో ఇంక మా బ్రతుకు అయిపోయింది అన్నట్లుగా ఉంటున్న మనము సైఫను ఇంటి వారిని చూచి నేర్చుకోవాలి. ఇప్పటి వరకు దిగులుతో ఎన్ని దినములు, సంవత్సరములు వ్యర్థం చేశామో తెలిసికొని వాటి నుండి విడిపించబడి, వాగ్దానము యొక్క నెరవేర్పు కొరకు విశ్వాసముతో ఎదురు చూద్దాము.

అట్టి కృప ఈ నూతన సంవత్సరములో దేవుడు మనందరికి అనుగ్రహించి నడిపించును గాక.

నూతన సంవత్సర శుభాకాంక్షలు.





# సాధు సుందర్ సింగ్ జీవిత చరిత్ర

**– సీరియల్ 38వ భాగము**

సుందర్‌సింగ్ చేసిన ప్రయాణములలో జరిగిన సంఘటనల అద్భుతాల యొక్క నిర్దుష్టమైన కాలక్రమాన్ని నిర్ణయించడం చాలా కష్టం. కానీ వాస్తవాలు వాస్తవాలే. ఈ విశ్వాస సాహస కార్యములు మన ఆత్మలకు గొప్ప ఉత్సుకతను కలిగిస్తాయి.

సుందర్ ఒకరోజు ఒంటరిగా ప్రయాణిస్తూ ఉన్నాడు. అది బందిపోటు దొంగలకు పేరుగాంచిన స్థలం. ఆ దొంగలు ఆ దారిన ప్రయాణించే వారిని ఆటకాయించి, వారిని చంపి, వారి దగ్గర ఉన్న విలువైన సామాగ్రిని అంతా దోచుకుంటారు. సుందర్ ఆ దారిలో ప్రయాణిస్తుండగా అకస్మాత్తుగా ఓ దొంగ అతనిని ఆటకాయించాడు. చేతిలో కత్తి పెట్టుకొని బెదిరించగా, సుందర్ మౌనంగా తల వంచి, ఆ కత్తి తన మెడ మీద ఎప్పుడు పడుతుందా అని ఎదురుచూస్తుండినాడు. కాని ఆశ్చర్యంగా ఆ దొంగ కత్తిని క్రిందికి దించేశాడు. అతని ప్రవర్తనా విధానం పూర్తిగా మారిపోయింది. సుందర్ లాంటి పొడవైన, బలవంతుడైన వ్యక్తి అంత సాత్వికంగా తల వంచడం చూచి అదుర్భాటు చెందాడు. సుందర్ మాటలు విని ఆశ్చర్యపడ్డ ఆ దొంగ సుందర్‌ను ఒక గుహ దగ్గరకు నడిపించాడు. సుందర్‌ను ఆ గుహ అంతర్భాగములోనికి తీసుకుని వెళ్ళాడు. ఆ దొంగ చేత చంపబడిన వారి యొక్క అస్థిపంజరాలు సుందర్ చూచాడు. “ఈ మనుష్యులందరిని నేనే చంపాను! దేవుడు నన్ను క్షమిస్తాడా?” అని ఆశ్చర్యమును వెళ్లబుచ్చాడు ఆ దొంగ. అప్పుడు యేసుప్రభువు పాపులకు అనుగ్రహించే పాపక్షమాపణ గురించి నిస్పృహలో ఉన్న ఆ దుష్టునికి వివరించాడు సుందర్.

సాధుసుందర్‌సింగ్ దారిన సాగిపోతూ తనను మరణము నుండి తప్పించినందుకు దేవునికి కృతజ్ఞతాస్తుతులు చెల్లించి, నిజంగా నిర్భాగ్యుడైన ఒక పాపిని, నశించిన దానిని వెదకి రక్షించడానికి వచ్చిన రక్షకుని వైపుకు చూపించగలిగినందుకు సంతోషించాడు. ఒక అడవి ప్రాంతములో ఉన్న నల్లచిరుత ఆ చుట్టుపట్ల ఉన్న గ్రామాల్లో ఎందరినో చంపింది. సుందర్ ఆ అరణ్యం గుండా నడిచి వెళ్ళుచుండినప్పుడు చిరుత ఆయనకు హాని చేయక పోవడాన్ని చూచిన గ్రామస్తులు నిశ్చయంగా ఈయన మహాత్ముడేయని చెప్తూ ఆయన ప్రసంగములను ఎంతో శ్రద్ధాభక్తులతో విన్నారు. అంతే గాక సుందర్‌తో కలిసి కొన్ని దినములు ఆ గ్రామములో గడిపిన ఒక వ్యక్తి కూడా ఓ ఆశ్చర్య విషయమును తెలిపాడు. తరువాత కాలములో ఆయన ఇంగ్లండు వై.ఎమ్.సి.కి కార్యదర్శి అయినాడు.

ఆ రాత్రి మేము నిద్రించడానికి ముందు ఆ లోయలో దివిటీలు కదలడం చూచి ప్రజలు చిరుతపులి కోసం వెదకుచున్నారని చెప్పాడు సుందర్. ఆ రోజు మధ్యరాత్రి వేళలో మంచం మీద సుందర్ లేకపోవడం చూచి కిటికీలో నుంచి ఆయన తొంగి చూచాడు. రాత్రివేళల్లో సుందర్ అలా ఒంటరిగా వెళ్ళి ఎంతోసేపు ప్రార్థనలో ఉంటారని ఆయనకు తెలుసు. కాని ఆ సమయములో చిరుతపులి గుర్తు వచ్చి కలవరపడిపోయాడు. ఇంటికి కొంచెం దూరంలోనే బహిరంగ స్థలంలో కూర్చుని ఆ లోయను పరీక్షించుచుండినాడు. నిండు వెన్నెల ప్రకాశంతో ఆ రాత్రి ఆహ్లాదకరంగా ఉంది. పిల్లగాలులు వీస్తూ ఆ దృశ్యం ఎంతో రమణీయంగా ఉంది. అంతలోనే సుందర్ కుడివైపున ఏదో కదలడాన్ని చూచి అదిరిపోయాడు. ఓ జంతువు సుందర్ వైపే వస్తూ ఉన్నది. దగ్గరకు వచ్చినప్పుడు చూస్తే అది ఆ చిరుత పులే. దానిని చూచి తాను వణికిపోయాడు. సుందర్‌ని పిలుద్దామంటే గొంతు పెగల్లేదు. అలా చూస్తుండగానే సుందర్ దాని వైపు తిరిగి తన చెయ్యి చాపాడు. పెంపుడు కుక్కలాగా తల నిమరమన్నట్లుగా ఆ చిరుత సుందర్ చేతిలో తన తల వాల్చింది. కొంచెంసేపయిన తరువాత సుందర్ తిరిగి వచ్చి నిద్రించాడు గాని తనకు మాత్రం నిద్రపట్టలేదు. క్రూరజంతువులపై ఈయనకి ఇంత అధికారం ఎలా వచ్చిందబ్బా అని ఆశ్చర్యపడుతూ కూర్చుండినాడు.

నేను, మరో టిబెట్ దేశీయుడు కలిసి టిబెట్ సరిహద్దు వెంట ప్రయాణిస్తున్నప్పుడు, ప్రయాణం చాలా కష్టంగా ఉంది, దారి చాలా ఇరుకుగా ఉన్నది. ఆ దారి అంచు నుండి జారిపడి ఒకతను స్పృహ లేకుండా పడియుండడాన్ని మేము చూసి, అతడు ఇంకా బ్రతికుంటే, అతనిని మనతో తీసుకొని పోదామని తోటి ప్రయాణికునితో చెప్పాను. ఇతనిని కాపాడే ప్రయత్నములో మన ప్రాణాలే పోతాయేమో అని అతను ముందుకి సాగిపోయాడు. నేను ఆ పడిపోయిన అతనిని చూస్తే, ప్రాణమున్నది గాని స్పృహ లేదు. ఎంతో కష్టం అయిననూ అతనిని నా వీపు మీద వేసికొని, వేగంగా నడవలేకపోయినా, బరువుతో నెమ్మదిగా ఒక్కో అడుగు వేసుకుంటూ ముందుకి వెళ్తున్నాను. ఈ రాపిడి నాకు కొంచెం వెచ్చదనమును ఇచ్చింది. అంతే కాక ఈ వెచ్చదనం నా వీపు మీద ఉన్నవానికి కూడా సోకింది. ఎలాగో చివరికి మేమిద్దరం ప్రాణాలతో గమ్యం చేరాము. కానీ ఒంటరిగా విడిచి ముందుకి సాగిన టిబెట్ దేశస్థుడు దారిలో పడి చనిపోయి, రాయిలా బిగుసుకు పోయి ఉన్నాడు.

తన ప్రాణము దక్కించుకొనువాడు దాని పోగొట్టుకొనును గాని నా నిమిత్తము తన ప్రాణము పోగొట్టుకొనువాడు దాని దక్కించుకొనును (మత్తయి 10:39) అనే సువార్త సత్యము ప్రజల హృదయములలో నాటుకొనునట్లుగా ఈ వృత్తాంతమును చెప్పాడు సుందర్.

– సేకరించబడింది

(ఇంకా ఉంది )

 లేనిదాని గురించి ఆలోచించి బాధపడే దాని కన్నా ఉన్నదాని విలువ తెలుసుకొని సంతృప్తి పడటం మిన్న



# చేసిన మేలులు మరవలేక......

Happy New Year పిల్లలూ! ఎలా ఉన్నారు? క్రిస్మస్ ఎలా Celebrate చేసుకున్నారుల? హ్యాపీగా ఉన్నారా? ఏంటి సంగతులు? ఈ 2015 year లో ఏమేమి plans వేసుకున్నారు? బాగా చదువుకోవాలనా? మంచి పేరు తెచ్చుకోవాలనా? కోరుకున్న విధంగా జీవించాలనా? సాకులు చెప్పాలని కాక ఉపయోగ పడాలనా? గెలవాలని కాక ఎదగాలనా? ఏది కోరుకుంటున్నారు? ఏదైనా ప్లాన్ తప్పకుండా వేసుకుని ఫాలో అవ్వండి. ఇక స్టోరీలోకి వెళదాం?

అనగనగా ఒక మహారాజు, పేరు చంద్రసేనుడు, తల్లి అంటే చాలా ప్రేమ. ఆమెకు జంతువులంటే మిక్కిలి ప్రేమ. ఉద్యానవనంలో ఎన్నో జంతువులను ప్రేమగా సాకేది. ఆమె మరణానంతరం చంద్రసేనుడు తల్లి జ్ఞాపకార్థం భారీ నగదుతో ఒక బహుమానమును ప్రకటించాడు. జీవ కారుణ్యం కోసం కృషి చేస్తున్న వ్యక్తులకు ఆ బహుమానం అందజేయాలనుకున్నారు. జీవ కారుణ్యం అంటే జీవాలపై కరుణ చూపడం అని అర్థం. ఈ బహుమానం కోసం దరఖాస్తు చేసుకోవాలని రాజ్యమంతా చాటింపు వేయించారు.

వందలకొద్దీ దరఖాస్తులు వచ్చి పడ్డాయి. వీధుల్లో తిరిగే జంతువులకు మేత వేస్తున్నామని కొందరు, పక్షులకు గింజలు వెదజల్లుతున్నామని ఇంకొందరు, వైద్యశాలలు స్థాపించి జంతువులకు చికిత్స చేస్తున్నామని మరికొందరు దరఖాస్తుల్లో రాశారు.

చంద్రసేనుడు వాటన్నింటినీ ఓ సారి చూసి మంత్రితో 'వీటిల్లో బహుమానానికి అసలైన అర్హులేవరో తేల్చి చెప్పండి' అని ఆదేశించాడు.

మంత్రి వేగులను సమావేశపరచి ఆయా వ్యక్తుల గురించి పూర్తి వివరాలు తెలుసుకుని రమ్మని పంపాడు.

వారం రోజుల్లో వాళ్లు అందరి గురించీ ఆరాతీశారు. సేనాధిపతి మంత్రితో మంత్రి వర్యా! దరఖాస్తు చేసిన వారిలో ఎక్కువ మంది రాజుగారి ప్రకటన వచ్చాకే జంతువుల పట్ల ప్రేమ చూపడం మొదలు పెట్టారు. అయితే కొద్ది మంది జంతువుల మేలు కోసం పనిచేస్తున్నా దాని వెనక ఏదో స్వార్థమైన ఆలోచన ఉంది అని చెప్పాడు.

మంత్రికి ఏం చేయాలో తోచలేదు. మళ్లీ సేనాధిపతి, మీకో విషయం చెప్పాలి. శివపురంలో నివసించే నరసింహం అనే రైతు నిజాయితీగా జంతువుల క్షేమానికి కృషి చేస్తున్నాడు. ఆయన ఈ బహుమానానికి దరఖాస్తు పెట్టుకోలేదు అని చెప్పాడు.

మంత్రి ఓ సారి నరసింహంను చూడాలనుకుని మారువేషంలో వెళ్లాడు. మంత్రి

అక్కడికి వెళ్లిన సమయంలో నరసింహం పశువులన్నింటికీ ఎంతో శ్రద్ధగా మేత వేస్తున్నాడు. తర్వాత వాటికి శుభ్రంగా స్నానం చేయించాడు. పైగా అవన్నీ పాలు కూడా ఇవ్వని వయసుపైబడిన పశువులు బక్కచిక్కిపోయి ఉన్నాయి.

మంత్రి తనని తాను పక్కూరి రైతుగా పరిచయం చేసుకుని నరసింహంతో మాట కలిపాడు. వయసైపోయిన వాటిని ఇంకా ఎందుకు పోషిస్తున్నావు? వీటి వల్ల నీకేం లాభం? అన్నాడు.

ఈ పశువులు ఎన్నో ఏళ్లు పాలిచ్చాయి, నా పొలాన్ని దున్ని ఎంతో సాయపడ్డాయి. నేను నాలుగు మెతుకులు తిన్నానంటే వీటి పుణ్యమే. ఇప్పుడు పనికిరావని వదిలించుకోవడం న్యాయమా? వయసు పైబడ్డ మన తలిదండ్రులను అలా వదిలించుకుంటామా? అని అన్నాడు.

ఆ మాటకు మంత్రి ఎంతో సంతోషించాడు. 'మరి మన రాజుగారు ప్రకటించిన బహుమానానికి నువ్వెందుకు దరఖాస్తు చేసుకోలేదు?' అన్నాడు.

దానికి నరసింహం 'నేనిదంతా చేస్తోంది నా ధర్మ నిర్వహణలో భాగంగానే కానీ ఎవరో ఏదో ఇస్తారని కాదు. ఈ పశువులు నాకిచ్చిన దాంట్లో కొంత దాచి వాటిని పోషిస్తున్నా' అన్నాడు.

ఆ మాటకు పక్కనే మారువేషంలో రాజు చప్పట్లు కొడుతూ వచ్చి నరసింహాన్ని ఆలింగనం చేసుకొని రాజలాంఛనాలతో కోటకు తీసుకెళ్లి బహుమతిని ప్రధానం చేశాడు.

చూశారా పిల్లలూ! నరసింహ జంతువులను ప్రేమించి తన బాధ్యతను చక్కగా చేయటం వలన బహుమానం అతనిని వెతుక్కుంటూ వచ్చింది. ఒకప్పుడు సహాయం చేసిన పశువులకు కూడా కృతజ్ఞత చూపిస్తున్నాడు. మరి మీరు ఏ విధంగా ఉన్నారు, కనీసం తల్లిదండ్రులకు కృతజ్ఞత చూపుతున్నారా? వాళ్లకి సహాయం చేయటం వలన కృతజ్ఞత కొంతైనా చూపగలం. చిన్న చిన్న పనులు చేయటం వలన వాళ్లు ఎంతో సంతోషిస్తారు. నేటి తరం పిల్లలు తల్లిదండ్రుల పట్ల, కుటుంబ సభ్యుల పట్ల వ్యవహరించే తీరును గమనిస్తే మన ఆత్మీయత, అనురాగాలను కోల్పోతున్నాము అనే భావన కలుగుతుంది. కుటుంబ సభ్యులతో గడపవలసిన సమయం అంతా సెల్‌ఫోన్స్, ఇంటర్‌నెట్ వాడటం వలన సమయం వృధా అయిపోతుంది. సహాయం చేయడానికి, కరుణ చూపడానికి సమయమే సరిపోవట్లేదు. సంకల్పం అనేది కోరిక నుండి పుడుతుంది. ఏ ప్లాన్‌కి అయినా సంకల్పం ఉంటే ఆ కోరిక సిద్ధిస్తుంది. మీరు మీ ప్లాన్స్ సక్సెస్ కోసం కృషి చేస్తారని విశ్వసించుచున్నాను. దేవుడు మీ ప్రయత్నములను సఫలపరచి మీకు తోడై యుండును గాక !

ఈ న్యూ ఇయర్‌లో ప్రేమ, కరుణ, కృతజ్ఞత కలిగి ఉంటారని అనేక ప్రశంసలు అందుకుంటారని ఆశిస్తూ......

– ప్రేమతో మీ అక్కయ్య

# దిద్దుబాటు

**దిద్దుబాటు విషయములో పేతురు వైఖరి :-**

మరి ఏ మనుష్యునీ గద్దించనంత తీక్షణమైన, కఠినమైన గద్దింపుతో యేసు పేతురును బహిరంగముగా గద్దించినప్పుడు ఆయన మరో రకంగా అతడిని ఎలా పరీక్షించాడో చూడగలం.

తాను తిరస్కరించబడి, సిలువ మరణం పొందబోతున్నానని యేసు తన శిష్యులతో చెప్పినప్పుడు, పేతురు - ప్రభువు మీద తీవ్రమైన మానవ ప్రేమతో ఆయన చేయి పట్టుకొని, ప్రభువా, అది నీకు దూరమగు గాక, అది నీకు ఎన్నడూ కలుగదని ఆయనను గద్దింపసాగెను - (మత్తయి 16:22) యేసు పేతురు వైపు తిరిగి, (ఇతర అపోస్తలులు వింటుండగా) బహిరంగంగా అతడితో ఇలా అన్నాడు. **"సాతానా, నా వెనుకకు పొమ్ము, నీవు నాకు అభ్యంతర కారణమై యున్నావు" (మత్తయి 16:23)**

**కోపగించుకోలేదు :-**

బహిరంగంగా గద్దించబడడం మన అహానికి ఎంతో అవమానం పైగా 'సాతానా' అని పిలువబడడం మరింత దారుణం. అయినప్పటికి పేతురు కోపగించుకోలేదు. యేసు బోధించిన "అహాన్ని చంపుకోవాలి" అనే సందేశమునకు కోపగించుకున్న అనేకమంది యేసు శిష్యులు ఆయనను విడిచి వెళ్ళిపోయారు. అప్పుడు యేసు 12 మంది అపోస్తులులను, వారు కూడా వెళ్ళిపోవాలనుకుంటున్నారేమోనని అడిగాడు. అప్పుడు జవాబు ఇచ్చింది పేతురే! అతడిలా అన్నాడు. "ప్రభువా, ఎవని యొద్దకు వెళ్ళుదుము? నీవే నిత్యజీవపు మాటలు గలవాడవు (యోహాను 6:68)

యేసు నోటి నుండి వచ్చిన కఠినమైన గట్టి మందలింపును స్వీకరించిన తరువాత పేతురు ఉచ్ఛరించిన మాటలివి. పేతురు మాటలను మరింత అద్భుతమైనవిగా చేసినదిదే. యేసు నోటి నుండి వచ్చిన ఏ గద్దింపు మాటలైనా, అవి నిత్యజీవపు మాటలేనని అతడు భావించాడు.

పెద్దవాడైన ఒక సహోదరుడి గద్దింపును అంగీకరించగలడమనేది మన వినయానికి పరీక్ష. పేతురు జయశాలిగా ఈ పరీక్షలో నెగ్గాడు.

**దిద్దుబాటు విషయములో యూదా వైఖరి :-**

బహిరంగంగా గద్దించి సరిచేసినప్పుడు ప్రతిస్పందించే విషయములో యేసు పేతురును పరీక్షించాడని చూశాము. ఈ విషయములో యూదా కూడా పరీక్షించబడ్డాడు. అయితే పేతురుకు భిన్నంగా అతడు ఓడిపోయాడు.

ప్రభువు తన కొరకు చేసినదానికి కృతజ్ఞతగా, ఒక స్త్రీ అచ్చమైన జటమాంసి అత్తరును యేసు పాదాల మీద పోసినప్పుడు అది డబ్బు వృధా చేయడం అని యూదా అభిప్రాయపడ్డాడు.

అయితే యేసు ఆమెను సమర్థించి, ఆమె పక్షం వహించి ఇలా అన్నాడు. **"నన్ను పాతిపెట్టు దినమునకు ఆమెను దీని నుంచుకొననియ్యుడి; బీదలు ఎల్లప్పుడును మీతో కూడా ఉందురు గాని నేనెల్లప్పుడు మీతో ఉండను" (యోహాను 12:7,8)**

అతడు కోపగించుకున్నాడు. అసలు ఇక్కడ యేసు, యూదా ఇస్కరియోతును గద్దించాడని ఎవరూ చెప్పరు. యేసు పేతురుని గద్దించిన దానితో పోల్చినపుడు ఇది లెక్కలోనికి రానే రాదు. అయినప్పటికీ, యూదా ఇస్కరియోతు కోపగించుకున్నాడు. ఈ సంఘటన జరిగిన వెంటనే యూదా ఏమి చేశాడో, మత్తయి సువార్తలోని వాక్యభాగములో చదువుతాము. **"అప్పుడు ఇస్కరియోతు యూదా, ప్రధాన యాజకుల యొద్దకు వెళ్ళి - నేనాయనను మీకు అప్పగించిన యెడల నాకేమి ఇత్తురని వారిని అడిగెను" (మత్తయి 26:14,15)**

అప్పుడు అనే మాట ఇక్కడ ప్రాముఖ్యమైనది. అతని కోపం అతనిని వెంటనే యాజకుల దగ్గరకు వెళ్ళి, యేసును అప్పగించేలా చేసింది. యేసు అతనిని సరి చేయడానికి ప్రయత్నించడమే అతని కోపానికి కారణం. పేతురు దిగ్విజయంగా పరీక్షలో నెగ్గాడు. కానీ యూదా ఘోరంగా ఓడిపోయాడు. నేడు దేవుడు మన మీద అధికారులుగా నియమించిన వారు మనలను సరిదిద్దినప్పుడెల్లా, నీవు నేను పరీక్షించబడుతున్నాం. తల్లిదండ్రులు పిల్లలను సరిదిద్దినప్పుడు వారు పరీక్షకు గురవుతున్నారన్న మాట. భర్తలు భార్యలను సరిదిద్దినప్పుడు వారు పరీక్షకు గురవుతున్నారు. పై అధికారులు ఉద్యోగులను గద్దించినప్పుడు అది వారికి పరీక్ష. మరి సంఘములో మన పెద్దలు మనలను గద్దించినప్పుడు అది మనకు పరీక్ష.

దిద్దుబాటు విషయములో మన యొక్క ప్రతిస్పందన, మన వినయమునకు అతి స్పష్టమైన పరీక్షలో ఒకటి. మనం నొచ్చుకున్నట్లయితే ఇస్కరియోతు యూదా సహచరులం. సరిదిద్దినప్పుడు నొచ్చుకుంటున్నట్లయితే మనం మన అహాన్ని చంపగలిగేలా సహాయం చేయమని దేవునికి మొరపెట్టాలి. ఆ విధంగా శాశ్వత బహుమానమును కోల్పోకుండా ఉండగలం. దిద్దుబాటు విషయంలో పేతురు, యూదాల ప్రతిస్పందనల మీదే వారి నిత్యత్వ వ్యవహారములు ఆధారపడి ఉన్నాయి. తాము పరీక్షా కాలంలో ఉన్నామని వారు పూర్తిగా గుర్తించలేకపోయారు. దిద్దుబాటు విషయములో మన ప్రతిస్పందనను కూడా దేవుడు చూస్తున్నాడన్న సంగతిని మనలో చాలా కొద్దిమంది మాత్రమే గుర్తించగలరు. దిద్దుబాటుకు మనం అంగీకరించకపోయినట్లయితే, లేదా సరిదిద్దినప్పుడు నొచ్చుకొని కోపగించుకున్నట్లయితే, దేవుని చేత యోగ్యులమని పించుకోలేము.

ఈ ప్రత్యేకమైన వ్యాసములో నేర్చుకొనవలసిన సత్యము మనకి కనబడుచున్నది. అదేమనగా చాలామంది తమకి తెలిసినదే కర్‌క్టనుకుంటూ మూర్ఖులుగా బతుకుతూ, మరి ఎవ్వరిని మాట్లాడనీయకపోవడం జరుగుతుంది. అది మంచిది కాదు. ఎదుటివారు చెప్పే దానిని వినడం, వారి దిద్దుబాటును అంగీకరించడం మనకు ఆశీర్వాదము.

# "నా జీవితములో దేవుని మేలులు"

**జి.వెంకట్రావు, ప్రకాశం జిల్లా**

నా పేరు వెంకట్రావు, మాది ప్రకాశం జిల్లా, దర్శి మండలం, తూర్పువీరాయపాలెం గ్రామం. మాది పేద నామకార్థ క్రైస్తవ కుటుంబము. నేను భయంకరమైన స్వభావముతో, పాపములో జీవిస్తూ ఉండేవాడను. ఇంటర్మీడియట్ చదువుతున్నప్పుడు విపరీతమైన తలనొప్పితో బాధపడుతూ, చాలా హాస్పిటల్స్‌లో చూపించుకున్నాను, అయినా తగ్గలేదు. ఆ తరువాత క్రమంగా ప్రార్థనలకు వెళ్ళుట ద్వారా మారుమనస్సు పొంది, 2003వ సం॥లో బాప్తిస్మము తీసుకున్నాను. తరువాత తలనొప్పి నుండి కూడా విడుదల పొందాను. 2008వసం॥లో నా బి.ఫార్మసి పూర్తి అయ్యింది. జాబ్ నిమిత్తం హైదరాబాద్ వచ్చాను. అప్పుడు నాకు జాబ్ విషయములో ఎలా ముందుకు వెళ్ళాలో తెలియక, సరైన జాబ్ దొరకక చాలా ఇబ్బందులు పడ్డాను. ఆత్మీయంగా కూడా చాలా బలహీనుడనయ్యాను. ఎందుకనగా అనేక సంఘములకు వెళ్ళాను కాని అవి నచ్చేవి కావు. మొదట ఆయన రాజ్యమును, నీతిని వెదికితే అవన్నియు మీకు అనుగ్రహించబడును అని చెప్పబడిన మాట ప్రకారం ఒక మంచి సహవాసం దొరికి, మొదట నా ఆత్మీయ జీవితము బాగుంటే దేవుడు తప్పకుండా నాకు ఒక మంచి జాబ్ అనుగ్రహిస్తారు అని మంచి సహవాసం కోసం ప్రార్థించుకోవాలనే నిర్ణయమును తీసుకోవడం జరిగింది. ఆ విధంగా ప్రార్థిస్తూ వచ్చినప్పుడు అనుకొనని విధంగా డిసెంబర్ 2008లో ఇద్దరు సహోదరుల ద్వారా ఎఫ్రాా మినిస్ట్రీస్ పరిచయం అయ్యింది. ఇక్కడ ఉన్న క్రమశిక్షణ, సహోదరుల ప్రేమ, ఆప్యాయతలు నన్ను చాలా ప్రభావితం చేశాయి. ఆత్మీయంగా బలపరచబడ్డాను. ఆ తరువాత దేవుడు నాకు మంచి జాబ్‌ని అనుగ్రహించారు.

2010, అక్టోబర్ 10వ తేదీన దేవుని నమ్ముకున్న అమ్మాయితో వివాహం జరిగింది. ఆ తరువాత ఊర్లో వ్యవసాయం వలన నష్టాలు వచ్చి బాగా అప్పుల పాలయ్యాము. అప్పుడు నాకు వచ్చే జీతములో ఊర్లో అమ్మానాన్నలకు పంపగా, మిగిలిన వాటితో ఇక్కడ ఇల్లు గడవక, ఆర్థికంగా చాలా ఇబ్బందులు పడ్డాను. నేను, నా భార్య చాలాసార్లు ఉపవాసముతో ప్రార్థించేవారము. ఈ పరిస్థితులన్నింటిలో జీవితం మీద విరక్తి చెంది, మెంటల్‌గా చాలా డిస్ట్రబ్ అయిన సమయములో దైవసేవకులు చెప్పే వాక్యము సూటిగా నాతో మాట్లాడి నన్ను ఎంతో ధైర్యపరిచేది. ఆ సమయములో దేవుని వాక్యం ద్వారా నేను ధైర్యపరచబడకపోతే నా జీవితం, కుటుంబము ఏమై ఉండేదో నేను ఊహించలేను.

ఆ తరువాత నేను ఒక మంచి జాబ్ కోసం ప్రయత్నించుచుండగా, దూర ప్రాంతములలో మంచి ఎమ్.ఎన్.సి కంపెనీలో ఆఫర్స్ వచ్చేవి కానీ నాకు సహవాసమును విడిచి వెళ్ళడం ఇష్టం ఉండేది కాదు. ఎందుకంటే కొన్నిసార్లు వెళ్ళడానికి సిద్ధమైన సందర్భములలో సహవాసములోని సహోదరులు సహోదరీలు మాకు చేసిన సహాయం, చూపించిన ప్రేమ, ధైర్యపరచుచున్న వాక్యములను తలంచుకున్నప్పుడు వాటి కంటే ఈ జాబ్ ఎక్కువ కాదు అనిపించి

కేన్సిల్ చేసుకున్నాను.

ఆ తరువాత 2013లో దేవుడు నాకు మంచి జాబ్ నిచ్చారు. జాబ్‌రీత్యా వారం రోజులకి ఒకసారి హైదరాబాద్ వచ్చి, ఆరాధనని చూసుకొని వెళ్ళేవాడిని. కుటుంబమునకు, పరిచర్యకి, పరిచర్యలోని పనులకు దూరమవుతున్నాను అని చాలా బాధగా ఉండి, దేవుని సన్నిధిలో ప్రార్థించుకుంటూ, సంఘములోని విజ్ఞాపన ప్రార్థనలలోనూ, కొంతమంది సహోదరులకు ప్రార్థనా అవసరతను చెప్పి ప్రార్థించమని కోరాను. వీటన్నింటి ఫలితంగా దేవుడు మరల నాకు హైదరాబాద్‌లోనే ఒక మంచి కంపెనీలో ఉద్యోగం రావడానికి కృప చూపించారు. ఇప్పుడు నేను సంతోషంగా కుటుంబముతోనూ, పరిచర్యలోని సహోదరులతో కలసి ఎక్కువ సమయం గడపడానికి కృప చూపిన దేవునికి కృతజ్ఞతాస్తుతులు చెల్లించుకుంటున్నాను. దైవసేవకులు, సంఘము యొక్క ప్రార్థనల ద్వారా ఇప్పుడు మేము ఆర్థిక ఇబ్బందుల నుండి విడిపించబడి సంతోషంగా ఉన్నాము. మాకు ఒక పాప, బాబు. వారి ఆరోగ్య విషయములోను, కుటుంబమును నడిపించుకొనుటలోను, ఉద్యోగములోను మంచి ఆలోచనలను, జ్ఞానమును ఇచ్చి నడిపిస్తున్న దేవునికి కృతజ్ఞతలు.

ఒకప్పుడు గురి, గమ్యము లేని వాడిగా జీవిస్తూ, ఎంతో భయంకరమైన కోపముతో, మూర్ఖత్వముతో, సంకుచిత స్వభావముతో, అనుమానముతో కన్ఫ్యూజన్ మైండ్‌తో జీవిస్తున్న నేను సహవాసములోనికి వచ్చిన తరువాత, ముఖ్యంగా ఇక్కడ జరిగే ఉపవాస ప్రార్థనల ద్వారా వాటన్నిటి నుండి విడిపించబడ్డాను. ఇంకా నేను మార్పు చెందవలసినది, దేవునిలో నేర్చుకొనవలసినది ఎంతో ఉంది. సంవత్సరములు జరుగుచూ ఉండగా, దేవునికి మరింత సమీపంగా జీవిస్తూ ఉండాలని ఆశపడుచున్నాను. ఈ విధంగా దేవుడు నా పట్ల కలిగి ఉన్న షరతులు లేని ఆయన ప్రేమను, కృపను తలంచినప్పుడు ఏమి ఇచ్చిననూ ఆయన ఋణం తీర్చలేను అని అనిపిస్తుంది. నేను, నా కుటుంబము మా చివరి శ్వాస వరకు ఆయనకు మహిమకరంగా జీవించాలని, క్రీస్తనే సంఘశరీరములో నేను ఒక అవయవంగా ఉంటూ, నాకు అప్పగించిన దానిని శక్తికి లోపం లేకుండా చేయాలని, ప్రభువును ఎరిగిన మీరందరు నా గురించి, నా కుటుంబము గురించి ప్రార్థించమని కోరుకుంటున్నాను.

### ఎపఫ్రా మినిస్ట్రీస్ ఆఫీస్ – హాలీడేస్ – 2015

| | | | | | |
|---|---|---|---|---|---|
| జనవరి 1 | - | న్యూ ఇయర్ | ఆగష్టు 15 | - | స్వాతంత్ర్య దినోత్సవము |
| జనవరి 15 | - | సంక్రాంతి | సెప్టెంబర్ 17 | - | వినాయక చవితి |
| జనవరి 26 | - | రిపబ్లిక్ డే | అక్టోబర్ 2 | - | గాంధీ జయంతి |
| మార్చి 21 | - | ఉగాది | అక్టోబర్ 22 | - | దసరా |
| ఏప్రియల్ 3 | - | గుడ్‌ఫ్రైడే | నవంబర్ 11 | - | దీపావళి |
| మే 1 | - | మేడే | డిసెంబర్ 25 | - | క్రిస్మస్ |

# విశ్వాసంలో ఎదుగుట

"ఆయన మృతులను సజీవులుగా చేయువాడును, లేనివాటిని ఉన్నట్లుగానే పిలుచువాడునైన దేవుడు" "జరుగుతుంది" అని చెప్పినప్పుడు అక్కడ ఏమీ ఉండకపోయినప్పటికి 'ఉంది' అనే ఆయన నమ్మాడు. తన హృదయములో దేవునికి సందేహము లేదు. అందుచేత ఆయన చెప్పినది ఖచ్చితంగా జరిగి తీరుతుంది. దేవుడు ఇలా చెప్తున్నాడు మనం ఎందుకు చేయకూడదు? పిల్లలుగా మనం కూడా దేవుడు చేసినట్లు ఎందుకు చేయకూడదు? ఆయన వాక్కు మన చెంతకు వచ్చినప్పుడు మనం ఆ విధముగా చేయాలి.

తండ్రియైన దేవుడు మన ప్రభువైన యేసుతో ఈ రీతిగా అంటున్నాడు **"నేను నీ శత్రువులను నీ పాదములకు పీఠముగా చేయువరకు నా కుడిపార్శ్వమున కూర్చుండుము" (కీర్తన 110:1).** యేసు ఈ క్షణములో తానే విశ్వాసంతో కూర్చుని ఏ సంగతులైతే లేవో వాటిని ఉన్నట్టుగా పిలుస్తున్నాడు. యేసుకు అనాది కాలం నుండీ ఆ వాగ్దానం ఉంది. ఆయన తన తండ్రి కుడివైపున కూర్చుని, తన శత్రువులు తనకు పాదపీఠం అవుతారని విశ్వాసముతో ఎదురు చూస్తున్నాడు. ఆ వాగ్దానం నెరవేరడానికి శతాబ్దాలు పడుతున్నప్పటికీ తన విశ్వాసం యొక్క ఫలాన్ని ప్రత్యక్షంగా ఈ భూమి మీద చూస్తానని తెలిసి, ఆయన విశ్వాస పరిచర్యలో కొనసాగుతూ, నెమ్మదిగా, విశ్రాంతిగా కూర్చుని ఉన్నాడు.

మనం కూడా ఏమి పలుకుతామో, విశ్వాసముతో ఏమి మాట్లాడుతామో దానిని బట్టి విశ్వాసములో నిశ్చింతగా ఉండవచ్చు. దేవుని చిత్తమును మనం తెలుసుకున్నప్పుడు "ఉన్నవాటిని" ఉండకూడదు అని చెప్పవచ్చును. చిట్టచివరకు, జీవితములో అవి జరగడం చూడగలము. మనకి అందిన దేవుని మాటను విశ్వసిస్తే అబ్రాహాము వలె వాక్కును మన నోటితో ఒప్పుకుంటాము. మన హృదయములో దానిని విశ్వసిస్తూ, మనం ఆ మాటను నోటితో బయటికి మాట్లాడాలని దేవుడు కోరుతున్నాడు. మాటలతో ఒప్పుకోవడములో ఉన్న శక్తిని అర్థం చేసుకోవడానికి తాళపుచెవి హెబ్రీ 3:1లో ఉంది. **పరలోకసంబంధమైన పిలుపులో పాలుపొందిన పరిశుద్ధ సహోదరులారా, మనము ఒప్పుకొనిన దానికి అపోస్తలుడును ప్రధానయాజకుడునైన యేసు మీద లక్ష్యముంచుడి.**

మన మీద నేరాలు మోపే వకీలు అపవాది లేక సాతాను, వాడు రాత్రింబగళ్ళు సహోదరుల మీద నేరాలు మోపేవాడు అని ప్రక 12:10లో వ్రాయబడి ఉంది. యోబుపై నేరం మోపడానికి దేవుని కుమారులతో కలసి సాతాను కూడా వచ్చి దేవుని ముందర నిలువబడి అవకాశం కొరకు కనిపెడుతూ ఉన్నాడు. అపవాది మోపిన నిందలలో, శ్రమలన్నిటిలో బాధలన్నింటిలో ఉన్న యోబు ఏ విషయంలోనూ నోటిమాటతోనైనా పాపం

చేయలేదు. యోబుకి అంతా పోయిననూ సాష్టాంగపడి దేవుని మ్రొక్కాడు. యోబును పరీక్షించడంలో దేవుని ఉద్దేశాన్ని తక్కువ అంచనా వేయడానికి అపవాదికి అతడేమీ అవకాశం ఇవ్వలేదు, నోటి మాటలు తప్పుగా పలుకలేదు.

యేసు మన తరపున వాదించే వకీలు. 1 యోహాను 2:1లో "ఎవడైనను పాపము చేసిన యెడల నీతిమంతుడైన యేసుక్రీస్తు అను ఉత్తరవాది మనకి ఉన్నాడు అని రాసి ఉంది. ఈ ఉత్తరవాది అను మాటకే వకీలు అని అర్థం. యోహాను 14:16లో ఆయనకు "ఆదరణకర్త" అని పేరు అనగా సహాయం చేయడానికి పిలువబడిన వ్యక్తి అని అర్థం. యోహాను 14:16-17లో యేసు ఇలా చెప్పాడు. "నేను తండ్రిని వేడుకొందును, మీ యొద్ద ఎల్లప్పుడు ఉండుటకై ఆయన వేరొక ఆదరణకర్తను అనగా సత్యస్వరూపియగు ఆత్మను మీకు అనుగ్రహించును" దీని అర్థం ఏమిటంటే తండ్రి దగ్గర పరలోకములో మన పక్షమున వాదించే "నీతిమంతుడైన యేసుక్రీస్తు గాక భూమి మీద మనతో కూడా ఉండడానికి పరిశుద్ధాత్ముడు ఉన్నాడు. దేవుని న్యాయస్థానములో మన పక్షమున వాదించేవారు బహు సమర్థులు. మనం సాక్షి స్థానంలో కూర్చున్న ముద్దాయిలము, మన పక్షమున వాదించే వకీలు యేసు, నేరం మోపే సాతాను, తండ్రియైన దేవుడు న్యాయాధిపతి.

ఈ వాదోపవాదాల్లో మన సాక్ష్యం ఒక గొప్ప ఆయుధం వంటిది. దానిపై ఆధారపడి అపవాది (నేరం మోపేవాడు)కి వ్యతిరేకంగా మన ఉత్తరవాది (యేసు) వాదిస్తాడు. మనం ఏది చెప్తామో అది మన ఫలితమును నిర్ణయిస్తుంది. అనుకూలమూ, లోపరహితమూ అయిన మన సాక్ష్యంపై ఆధారపడి మన వకీలు న్యాయాధికారి ఎదుట మన కేసు వినిపిస్తాడు. మనం పలికే అవకతవక మాటలపై ఆధారపడి నేరం మోపే వకీలు తన ఆరోపణను న్యాయమూర్తికి వినిపిస్తాడు.

ఇద్దరూ మనం చెప్పిన దాని మీదే వాదిస్తారు. మన ఒప్పుకోలును, లేదా సాక్ష్యమును మన ప్రధానయాజకుడు యేసుకు ఇవ్వాలి. అప్పుడు మన పక్షంగా ఆయన దానిని జడ్జికి వినిపిస్తారు. ఒకవేళ మనం ప్రతికూలమైన మాటలు పలికితే అపవాదికి తుపాకిలో నింపడానికి తూటాలను అందించిన వారమౌతాము. న్యాయాధిపతి తాను చెప్పిన దానినే మన నోటితో మనం కూడా చెప్పినట్లైతే, అది విని మనలను విడిపించడం, కాపాడి సంరక్షించడం చేస్తారు. దేవుడు చెప్పేది ఎప్పుడైనా సత్యమే. మనం పలికేది దేవుడు చెప్పినదే అయితే మన సాక్ష్యం సత్యమన్న మాట. న్యాయమైన తీర్పరిగా ఆయన తన మాటకు నిలబడి దానిని జరిగిస్తాడు.

గొర్రెపిల్ల రక్తము ద్వారా మన సాక్ష్యపు మాట ద్వారా దేవుడు చెప్పినదే మనమూ

చెప్తే, సాతానుని ఓడించగలము. మనం మన నోటితో ఒప్పుకున్నట్లయితే విడిపించబడతాము, రక్షించబడతాము, స్వస్థపడతాము. విమోచనలో ఇమిడి ఉన్న అద్భుతమైన ఈవులన్నీ మన నోటి మాటల మూలముగా మనవే అవుతాయి. మనం చెప్పేదానిలో నిజమైన శక్తి ఉంది. మన ఒప్పుకోలు మన విజయానికి నడిపిస్తుంది.

దేవుని వాక్యం వినడం ద్వారా విశ్వాసం కలుగుతుంది. ఆయన పట్ల ప్రేమ నిండిన హృదయముతో మనం విన్నదానికి లోబడాలి. ఆటంకములు ఉన్న సమయములో ఆయన వాక్కు చెప్తున్న దాన్ని ఉన్నదున్నట్లుగా పలకడం వలన విశ్వాసం కలుగుతుంది. వినడం, లోబడడం, ప్రేమించడం, చెప్పడం అనే ఈ నాలుగు ముఖ్యాంశముల ద్వారా మన విశ్వాసమును అభివృద్ధిపరచుకుంటాం.

(సేకరించబడింది)

# ఎపఫ్రా మినిస్ట్రీస్

## 2015 ప్రత్యేక ఉపవాస ప్రార్థనా కూడికలు

| నెల | తేది | వారం | సమయం (ఉదయం) | స్థలం (మందిరం) |
|---|---|---|---|---|
| జనవరి | 26 | సోమ | 9.00 | భాగ్యలత |
| ఏప్రియల్ | 03 | శుక్ర | 9.00 | భాగ్యలత, చింతల్, అనాజ్‌పూర్ |
| మే | 01 | శుక్ర | 9.00 | భాగ్యలత |
| ఆగష్టు | 15 | శని | 9.00 | భాగ్యలత |
| అక్టోబర్ | 02 | శుక్ర | 9.00 | భాగ్యలత |

**యౌవనస్థుల కూడికలు:-**
ప్రతి నెల 2వ బుధవారం - భాగ్యలత
రాత్రి గం.7.00 లకు
ప్రతి నెల 3వ ఆదివారం - చింతల్
సాయంత్రం గం.5.00 లకు

**స్త్రీల కూడికలు:-**
ప్రతి నెల 1వ బుధవారం - భాగ్యలత
ప్రతి నెల 2వ బుధవారం - చింతల్
రాత్రి గం.7.00 లకు

**పరిచారకుల కూడిక:-** ప్రతి నెల 4వ బుధవారం - భాగ్యలత నందు రాత్రి గం. 7.00 లకు.

**"దిగులుపడకుము నేను నిన్ను బలపరతును**
**నీకు సహాయము చేయువాడను నేనే"** - యెషయా 41:10

# సులభమైన ప్రార్థన యొక్క శక్తి

సమస్యలకు అందరమూ ఒకే రీతిగా స్పందిస్తాము. వెంటనే ఆ సమస్యను మనకి మనమే పరిష్కరించుకోవాలనుకుంటాము. అది పని చేయకపోతే, వెంటనే ఒక స్నేహితుని దగ్గరకో, ఆ సమస్యను పరిష్కరించగలరు అనుకున్న వ్యక్తి దగ్గరకి వెళ్ళడమో లేదా ఫోన్ చేయడం జరుగుతుంది. వీటన్నింటి కంటే ముందుగా మనం దేవుని సింహాసనం దగ్గరకి పరిగెత్తే వారిగా ఉండాలి. ప్రతి పరిస్థితికి మన మొదటి స్పందన ప్రార్థనయై ఉండాలి.

మన సమస్యలను మనం పరిష్కరించుకునే ప్రయత్నములు వదిలివేసినప్పుడు, వాటిని గురించి చింతపడుట మానివేసినపుడు మన పరిస్థితులలో దేవుడు కలుగజేసికొని, జవాబులు ఇస్తారు. **“నీ మార్గమును యెహోవాకు అప్పగింపుము, నీవు ఆయనను నమ్ముకొనుము, ఆయన నీ కార్యము నెరవేర్చును” కీర్తన 37:5. “నీ పనుల భారము యెహోవా మీద ఉంచుము, అప్పుడు నీ ఉద్దేశ్యములు సఫలమగును” అని లేఖనములు చెప్పుచున్నాయి సామె 16:3.** మన క్రియలను దేవునికి ఇచ్చినట్లైతే, మన ఉద్దేశ్యములను సఫలం చేస్తానని దేవుడు చెప్తున్నాడు. మన హృదయములను మౌనంగా ఉంచినట్లైతే ఆయన మన ఆలోచనలను తేటపరచి, తన సలహాలు, వ్యూహాలు మరియు నిర్దేశకత్వాలు ఇస్తారు.

దేవునికి మనలను మనం ఆధీనము చేసుకొను ప్రార్థనలో మొదటి మెట్టు ఏమిటంటే, చింతపడుట, కారణములు వెదకుట మానివేసి మన క్రియలను అనగా ఆలోచనలను దేవుని ఆధీనం చేయుట. నా పని నమ్ముట మాత్రమేనని, నన్ను మార్చుట దేవుని పని అని మనం గ్రహించిన రోజు, నిజంగా చాలా గొప్పరోజు. మన త్రోవలను దేవునికి ఇచ్చుట అనగా వాటిని మన నుండి దేవుని వైపునకు మళ్ళించుట. ఈ విధంగా చేయుట వలన, మన ఆలోచనలు ఆయన ఆలోచనలుగా మారతాయి, మనం ఆయన కోరినదే కోరుకుంటాము. అది జరిగినప్పుడు మన ప్రణాళికలు సంపూర్ణం అవుతాయి. ఎందుకంటే మన ఆలోచనలు దేవుని ప్రణాళికలతో పూర్తిగా ఏకీభవిస్తాయి. అనేక సమయములో మనకు సమస్యలు ఎందుకు వస్తాయి అంటే ఈ విధంగా దేవుని చిత్తమును చేయడానికి మనం ఇష్టపడము లేక ఆయన మార్గమును కోరము కనుక. అయితే ఆ సమస్యలను ఆయన వైపునకు మళ్ళించినప్పుడు, మనం సంతోషంగా, ఆశీర్వాదకరంగా ఉంటాము.

ఒకసారి మనం ప్రార్థించి, దేవునికి మన పరిస్థితులను ఆధీనం చేసి, మన సమస్యలను ఆయనకు నిజముగా ఇచ్చినప్పుడు, సమస్తమును ఆయన చేతులలో వదిలిపెట్టాలి. ఇంక వాటి గురించి ఆలోచించకూడదు, చింతింపకూడదు. కానీ మనము అలా చేయము, దేవుడు మన సమస్యల గురించి ఏమీ చేయడని భయపడుతూ, వాటిని

మనమే పరిష్కరించుకోవాలనుకుంటాము. "నీ మార్గమును యెహోవాకు అప్పగింపుము, నీవు ఆయనను నమ్ముకొనుము ఆయన నీ కార్యము నెరవేర్చును" కీర్తన 37:5. మన చింతలన్నీ ఆయన వైపుకు మళ్ళించమని, ప్రతి భారమును ఆయనపై ఉంచి నెమ్మది పొందమని వాక్యము చెప్తుంది. నెమ్మది అనే పదం విశ్రాంతి అని అర్థమును ఇస్తుంది. మన సమస్యలు దేవుని చేతులలో పెట్టినప్పుడు, మరల వెళ్ళి మనం వాటిని పరీక్షించి, కలవరపడకూడదు. అదే సమయములో మనం దేవునికి అప్పగించిన వాటిని పరిష్కరించుటలో నైపుణ్యంగా వ్యవహరిస్తాడు అను నమ్మకముతో, ధైర్యంగా ఉండి, మన హృదయములను విశ్రాంతిగా ఉంచుకోవాలి.

"ఆయన మిమ్మును గూర్చి చింతించుచున్నాడు గనుక మీ చింత యావత్తు ఆయన మీద వేయుడి" 1 పేతురు 5:7 ఈ వాక్యభాగము మన బాధలు, వ్యాకులము, సమస్తము ఒక్కసారే ఆయనపై వేయమని చెప్తుందని గమనించాలి. ఒక్కసారి వాటిని ప్రభువుకు ఆధీనం చేసినట్లయితే, దాని విషయములో మనకి ఏ సంబంధం లేదని అర్థం.

సమర్పణ ప్రార్థనలు మనలను మనము దేవునికి ఇచ్చుకొనుటతోను, ఆధఈనము చేసికొను ప్రార్థనలు  మన పరిస్థితులను ఆయనకు ఇచ్చుకొనుటతోను మిళితమై ఉంటాయి. సమర్పణలో మన శరీరం, ప్రవర్తన, మాటలు మాత్రమే కాకుండా మన ఆలోచనలు, ఉద్దేశాలు, తలంపులు కూడా మిళితమై ఉంటాయి. మన జీవితములను మనం జీవించలేమని గ్రహించినప్పుడు ఆధీనము చేసుకొను ప్రార్థన వస్తుంది. అంటే దేవుని అధికారమునకు ఒప్పుకొనుట అని అర్థం. మనం నిజంగా దేవునికి మన సమస్యలను అప్పగించినప్పుడు, మరల మన మనసులలో వాటి గురించి చింతించకుండా, దేవుని వైపుకు వాటిని మళ్ళించి, అక్కడే వాటిని వదిలివేయాలి.

ఇంకా ఉంది

(సేకరించబడినది)


## ఉపవాస ప్రార్థన

ఉపవాస ప్రార్థన - 2015, **జనవరి 26వ** తేది (సోమవారం)
ఉదయం 9 గం.ల నుండి సాయంత్రం 4 గం.ల వరకు జరుగును.
కావున పాల్గొని దేవుని దీవెనలు పొందగలరు.

**వివరములకు:**

9666666249 | 040-24202227




# బైబిల్ క్విజ్ -38

(సంఖ్యాకాండము నుండి ఇవ్వబడినవి)

ఈ క్రింది ప్రశ్నలకు సరైన జవాబులు వ్రాయండి

**1.** ఇశ్రాయేలీయులు దేవునిని ఎన్నిసార్లు పరిశోధించారు?

**2.** మిద్యానీయుల మీద యుద్ధమునకు మోషే పంపిన యాజకుని కుమారుడు ఎవరు?

**3.** దశమభాగములో నుండి దశమ భాగమును యెహోవాకు ప్రతిష్టార్పణముగా చెల్లింపవలసింది ఎవరు?

**4.** మోషేను గురించి దేవుడు ఏమని సాక్ష్యము ఇచ్చారు?

**5.** తలవెంట్రుకలను కత్తిరించడం నుండి నిషేధించబడిన వారు ఎవరు?

**6.** కూషు దేశపు స్త్రీని తన భార్యగా చేసుకున్నందుకు మోషే మీద సణిగిందెవరు?

**7.** బ్రతికి ఉండగానే భూమి చేత మ్రింగబడిన వారెవరు?

**8.** ఆశ్రయపురములు ఎన్ని ? అవి దేని కోసం?

**9.** తెగులు ఆగిపోవడానికి బ్రతికిన వారికి, చనిపోయిన వారికి మధ్య నిలువబడినది ఎవరు?

**10.** మోషే పంపించిన ఇశ్రాయేలు ప్రధానులు ఎన్ని రోజులు కనాను దేశమును సంచరించి చూచారు?

ఈ ప్రశ్నలకు సరైన సమాధానములు ఫిబ్రవరి15వ తేదీ లోపు మాకు వ్రాసి పంపించండి. సరైన సమాధానములు వ్రాసిన వారి పేర్లు మార్చి 2015 పత్రికలో ప్రచురించబడతాయి.

**పంపవలసిన చిరునామా :- ఎడిటర్-స్పర్శ,** ఎపఫ్రా మినిస్ట్రీస్, ప్లాట్ నెం. 1, శాంతి నగర్, వాటర్ట్యాంక్ ఎదురుగా, భాగ్యలత కాలని, వనస్థలిపురం, హైదరాబాద్ – 500 070.

**బైబిల్ క్విజ్ – 37 జవాబులు (లేవీ, సంఖ్యాకాండము నుండి ఇవ్వబడినవి) :**

1. పన్నెండు (లేవీ 24:5,6)
2. నాదాబు, అబీహు (లేవీ 10:1)
3. నయస్సోను (సంఖ్యా 2:3)
4. 857 వచనాలు
5. పంది (లేవీ 11:7)
6. సీనాయి అరణ్యంలో (సంఖ్యా 1:19), మోయాబు మైదానములో (సంఖ్యా 26:63,64)
7. హోబాబు (సంఖ్యా 10:31)
8. సునాదకాలం/జూబ్లీ సంవత్సరం (లేవీ 25:11)
9. అహరోను కుమారులు (లేవీ10:1,2)
10. అహీయెజెరు (సంఖ్యా 2:25)

**బైబిల్ క్విజ్ – 37 ప్రశ్నలకు సరియైన జవాబులు వ్రాసి పంపిన వారి పేర్లు :**

ఎమ్.తులసి, ఆర్.ఐజాక్ కుమారి, నీతా, త్రినాధ్రావు, సౌజన్య

 కాలాన్ని వృధా చేయడమంటే నిన్ను నువ్వు దోపిడీ చేసుకోవడమే.

# జన్మదిన శుభాకాంక్షలు

క్రీస్తునందు ప్రియులైన వారికి శుభమని చెప్పి వ్రాయునది.
తండ్రియైన దేవుని నుండి కృపయు, సమాధానము మీకు కలుగును గాక !
ఈ పత్రిక ద్వారా జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తున్నాము.

**" నీ దేవుడైన యెహోవా కన్నులు సంవత్సరాది మొదలుకొని సంవత్సరాంతము వరకు ఎల్లప్పుడు మీ జీవితముల మీద ఉండును గాక ! "**

**జనవరి - ఫిబ్రవరి**

**భాగ్యలత** : యోహాను, సుధాకర్, సంతోషి, సుజాత, చైత్రికబిస్వాల్, రవికుమార్‌బెన్ని, అభిషేక్, అనిల్‌కుమార్, హానోక్, కిరణ్‌కుమార్, గిఫ్టీషారోన్, నవీన్, రమాదేవి, సుధారాణి, కుమారి, క్రాంతికృష్ణ, అంజి, శ్రీదేవి, శిరీష, పాల్‌ప్రవీణ్, దీవెన, శ్రీధర్, నిర్మల, మంజుల, జోసెఫ్, రాబిన్, బ్యూలా, పూజిత, సౌజన్య, సుస్మిత, సుమతి, తిమోతి, నిహారిక, రమేష్, అశోక్, జ్యోత్స్న, కరుణాకర్‌రాజ్, శ్రీనివాస్, సునీత, ఎస్తేరు, ఉదయ్‌కుమార్, అనిత, రాణి, రాజా, తరుణోదయ్, తేజస్విని, రవి, విజయలక్ష్మి, జ్యోతి, సజీవ్, శ్రీలక్ష్మి, శంకర్, అఖిల్, శ్రావ్య, సత్య, కృపాలత, రసూయేల్, సురేఖ, రాజేష్, సుధీర్, క్విన్సీమెల్కీసెదెక్, చల్లారావు, హర్షిత, మీనా, పాండు, హిమబిందు, వెంకటలక్ష్మి, శైలజ, తులసి, మనోహర్, వెంకన్న, జైన్, నానికుమార్, ఫ్రాన్సిస్, దివ్య, రాజ్‌కుమార్, లత, స్నేహలత, ఫీబే, ఉమాశ్రీ, వేణుమాధవ్, ఆనందరావు, వినోద్, జీవన్, దివ్యాంశ్, అనూష, ప్రశాంత్, తబిత.

**చింతల్** : కొర్నేలి, ప్రకాశ్, సజీవ్, శ్రావణి, సునీత, జయరాజు, రాహుల్, జ్యోతిర్మయి, పుష్పలత, జెర్రీరోజ్‌రాయ్, ఉదయ్, రిబ్కా, దానియేల్, జె.యస్.ఎన్.మూర్తి, పవన్‌చందు, హెప్సిబా, అమర్, సువర్ణరాజు, మహిమజ్యోతి, హైమావతి, కీర్తన, స్పందన, నాగరాజు, దుర్గావెంకటలక్ష్మి, నాగవెంకటలక్ష్మి, సురేఖ, సుధీర్, అఖిల్, రాజేష్

**అనాజ్‌పూర్** : సువమ్మ, అంకమ్మ, సునీత, మరియ, లక్ష్మి, అమర్‌నాథ్, జాన్‌బీ

**ఇ.సి.ఐ.యల్** : జీవా, సజీవ్

**"స్పర్శ"** అనే మన ద్విమాస పత్రిక సంవత్సర చందా రూ. 100/- లు, జీవితకాల చందా రూ. 2000/- లు మరియు విదేశములకు సంవత్సరమునకు **US $ 40.**

చందాదారులు కావలసిన వారు **ఎపఫ్రా మినిస్ట్రీస్ ట్రస్ట్, హైదరాబాద్** (Epaphras Ministries Trust, Hyderabad) పేరున **డి.డి/మనిఆర్డర్** తో పాటు మీ పూర్తి వివరములు ఈ ఫారములో నింపి మా చిరునామాకు పంపించగలరు.

1. పూర్తి పేరు: ______________________

2. చిరునామా: ______________________

______________________

______________________

పిన్ కోడ్: ______________________

**మీ ప్రార్థనావసరతలు:**

______________________

______________________

______________________

______________________

మా చిరునామా:
**ఎపఫ్రా మినిస్ట్రీస్,** ప్లాట్ నెం. 1, శాంతి నగర్, వాటర్‌ట్యాంక్ ఎదురుగా,
భాగ్యలత కాలని, వనస్థలిపురం, హైదరాబాద్-70, ఫోన్: 040-2420 2227



2014, డిసెంబర్ 25వ తేది ఆడిటోరియం వెలుపల
క్రిస్మస్ ఆరాధనలో పాలుపొంపులు పొందిన దేవుని ప్రజలు.

2014, డిసెంబర్ 25వ తేదిన క్రిస్మస్ కేక్ కట్ చేయబోవుచున్న సందర్భములో...





# ఎపఫ్రా మినిస్ట్రీస్

ప్లాట్ నెం.1, శాంతినగర్, భాగ్యలత కాలని,
వనస్థలిపురం, హైదరాబాద్ - 500 070
Ph: 040-24202227 Cell: 9666666249
email: mail2church@gmail.com | web: www.epaphra.org

*Published by:* T.Epaphras, Plot No.1, Shanti Nagar, Opp.Water Tank, Bhagyalatha Colony, Vanasthalipuram-500070, Hyderabad.
*Printed by:* Vamsi Art Printers, Lakdikapool, Hyderabad (AP) | *Editor:* Bro. T.Epaphras